విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

బుధవారం 19 ఫిబ్రవరి 2025 8 పేజీలు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి బడ్జెట్‌కు వ్యతిరేకంగా

రేపు తిరుపతిలో జరిగే ఆందోళనను జయప్రదం చేయండి

- నిర్మలమ్మ బడ్జెట్ మోసపూరిత బడ్జెట్
- హిందువుల గురించి మాట్లాడే అర్హత బిజేపికి లేదు
- పేదల బడ్జెట్ కాదు కార్పొరేట్ బడ్జెట్
- వామ పక్ష నేతలు ఆరోపణ

విశాలాంధ్ర - తిరుపతి : కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రధానంగా కార్పొరేట్ లకు అనుకూలంగా ఉంది తప్పా పేదరిక నిర్మూలన లక్ష్యంగా బడ్జెట్ లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు , సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి తీవ్రంగా విమర్శించారు. వామపక్ష పార్టీల జాతీయ సమితి పిలుపు మేరకు తిరుపతి లో వాకింగ్ సెంటర్లో వాకర్స్‌కు కేంద్ర బడ్జెట్ కు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ కార్యక్రమం వామపక్ష పార్టీ నాయకులు పంపిణీచేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామా నాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళిలు

2

అయ్యో... అన్నదాత..!



వరి ధర పతనం

దిగుబడి అంతంత మాత్రమే

నష్టాల ఊబిలో అన్నదాత

<u>విశాలాంధ్ర - తొట్టంబేడు :</u>

ప్రకృతి సహకరించక... ప్రభుత్వం కరుణించక... ఈ యేడు కూడా అన్నదాత నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాడు. వర్షం, మంచు, తేమ కారణంగా వరి ధాన్యం దిగుబడి బాగా తగ్గింది. పంట చేతికి అందేవేళ వ్యాపారులు సిండికేట్ కావడంతో వరి ధాన్యం ధర పాతాళానికి పడిపోయింది. 75కిలోల బస్తా కేవలం రూ.1,500 మాత్రమే పలుకుతోంది. ఫలితంగా అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తూర్పు మండలాలను ధాన్యాగారం అని పిలుస్తుంటారు.

- తరువాయి 2లో

వైభవోపేతం... ధ్వజారోహణం

- శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు : జేఈవో వి.వీరబ్రహ్మం

2లో

మహాశివరాత్రి ఏర్పాట్లు ముమ్మరం చేయండి

- దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి వినయ్ చంద్

<u>విశాలాంధ్ర - శ్రీకాళహస్తి:</u>

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లు ముమ్మరం చేయాలని దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి వినయ్ చంద్ ఆదేశించారు. ఈ నెల 21వ తేదీ నుంచి శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వినయ్ చంద్ తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనరు చంద్రశేఖర్ ఆజాద్ తో కలసి మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యంగా క్యూలైన్లు, భక్తులను లోపలికి అనుమంతించే మార్గం... దర్శనం తరువాత బయటకు వెళ్లే మార్గం నుంచి ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

- తరువాయి 2లో

ఎన్‌టిఆర్ వైద్య సేవలందించడంలో ....

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- జిల్లా కలెక్టర్ హెచ్చరిక

2

అయ్యో... అన్నదాత

(మొదటి పేజీ తరువాయి) గత యేడాది నవంబరు నుంచి ఈ యేడాది జనవరి వరకు కురిసిన భారీ వర్షాలకు తూర్పు మండలాల రబీ రైతుకు ఆశలు చిగురించాయి. శ్రీకాళహస్తి వ్యవసాయశాఖ డివిజనులో 17వేల హెక్టార్లకు పైగా వరి పంట సాగు చేశారు. నవంబరు మాసంలో నాటిన వరికి అనుకోని వర్షం, మంచు, తేమ అవరోధాలుగా మారి ధాన్యం దిగుబడి, నాణ్యత తగ్గింది. ఎకరాకు 20 బస్తాలకు మించి దిగుబడి రావడం లేదు. రైతులు వరి పంట సాగు చేయడానికి ఎకరాకు సుమారు రూ.30వేలు వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం ప్రైవేటు మిల్లర్లు, దళారులు 75 కిలోల మేలు రకం ధాన్యం బస్తాకి రూ.1500మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుకు పెట్టుబడి కూడా గిట్టడం లేదు. ఇక సంక్రాంతి అనంతరం వర్షాలు తగ్గ ముఖం పట్టడంతో నవంబరు మాసంలో వరి వేసిన రైతులు కోతలకు ఉపక్రమిస్తున్నారు. దాదాపు 17వేల హెక్టార్ల సాగులో 10 శాతం పైగా కోతలు పూర్తయ్యాయి. ఈ క్రమంలో రైతులకు మద్దతు ధర ప్రకటించడంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. కోతలు ప్రారంభమై ఇరవై రోజులు దాటుతున్నా... ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ధాన్యం కొనుగోళ్లను ఎలా చేయాలన్న ప్రాథమిక శిక్షణా తరగతుల దశలోనే కార్యక్రమం ఉంది. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు సంబంధించిన ఆన్ లైన్ వెబ్ సైట్ రైతు సేవా కేంద్రాల్లో ఓపెన్ కాలేదు. ఫలితంగా కల్లాల వద్దే రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. గతేదాది మేలు రకం ధాన్యం క్వింటాకు ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర రూ.2,233లు. ఈ ఏడాది దాన్ని రూ. 2,350కు పెంచింది. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరణ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాకపోవడంతో రైతులు వేరే దారి లేక దళారులు నిర్ణయించిన ధరకే విక్రయించుకోవాల్సి వస్తోంది. దీంతో అన్నదాతకు ధర గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కాగా ఈ విషయమై శ్రీకాళహస్తి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రమేష్ రెడ్డిని వివరణ కోరగా... అనుకోని వర్షాలు, మంచు, తేమ కారణంగా తూర్పు మండలాల్లో ధాన్యం దిగుబడులు తగ్గిన మాట వాస్తవమేనన్నారు. ధాన్యాన్ని విక్రయం చేందుకు రైతులు ముందుకొస్తే కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. సహకార సంఘాలు, రైతు సేవ కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు చేసుకుని ఉంటేనే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడానికి రైతులు అర్హులవుతారన్నారు.

ధ్వజారోహణం

విశాలాంధ్ర- చంద్రగిరి : శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం ఉదయం 8.15 నుండి 8.40 గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది.అంతకుముందు ఉదయం 6.30 నుండి 8.15 గంటల వరకు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవం ద్వారా తన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారు ఒకమారు ముందుగా పర్యవేక్షిస్తారు. అనంతరం అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తుహోమం, గరుడ లింగహోమం, గరుడ ప్రతిష్ఠ, రక్షా బంధనం చేపట్టారు. మీన లగ్నంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఇందులో వైఖానస శాస్త్రోక్తంగా గరుత్మంతుణ్ణి కొత్త వస్త్రంపై ఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్టించారు.18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని లక్ష్యం. కంకణభట్టార్ శ్రీ నారాయణ ఆచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు : జేఈవో వి. వీరబ్రహ్మంజేఈవో వి.వీరబ్రహ్మం మీడియాతో మాట్లాడుతూ, ధ్వజారోహణంతో వైభవంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్టు తెలిపారు. ఆలయంలో ఫిబ్రవరి 18 నుండి 26వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టామన్నారు. శ్రీనివాసమంగాపురంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదా లను భక్తులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 22న గరుడసేవ, ఫిబ్రవరి 23న స్వర్ణరథోత్సవం, ఫిబ్రవరి 25న రథోత్స వం, ఫిబ్రవరి 26నచక్రస్నానం జరగనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 నుండి 9 గంటల వరకు, తిరిగి రాత్రి 7 నుండి 8 గంటల వరకు వాహనసేవలు వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు.మీడియా సెంటర్‌లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన జేఈవో.శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ ప్రజా సంబంధాల విభాగం ఆధ్వర్యంలో వాహన మండపం పక్కన ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో జేఈవో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. మంగళవారం రాత్రి 7 నుండి 8 గంటల వరకు స్వామివారు పెద్ద శేష వాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనం ఇవ్వను న్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేకాధికారి మరియు సివిఆర్వో డా.టి.రవి, ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, వైఖానస ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ప్రసాదాల ఇన్స్పెక్టర్ సలవాది హరిబాబు ,ధన శేఖర్, ఆలయ అర్చ కులుబాలాజి రంగాచార్యులు,ఇతరఅధికారులు,విశేషసంఖ్యలోభక్తులుపాల్గొన్నారు.

ఆందోళనను జయప్రదం చేయండి

(మొదటి పేజీ తరువాయి) మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా, వైద్యంతో పాటు వ్యవసాయ రంగానికి తీరని అన్యాయం చేశారని అన్నారు. దేశం లో యువత ఉద్యోగాలు లేకుండా నిరుద్యోగులు గా ఉన్న వారికీ 10 శాతం, పట్టభద్రులైన వారు 13 శాతం మొత్తం గా 23 శాతం మంది ఉన్నారని వీరి సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయించక పోవడం దారుణం అన్నారు. సంక్షేమ పథకాలకు పూర్తిగా తగ్గించారు పెద్ద సంఖ్యలో రోడ్ల కోసం బడ్జెట్ కేటాయించారు టోల్ ప్లాజా పేరుతో ప్రజల నుండి పెద్ద మొత్తంలో ముక్కు పిండి వసూలు చేసి కార్పొరేటర్లకు అనుకూలంగా మార్చుతున్నారు అని విమర్శించారు. కూలీలకు ఉపయోగపడే విధంగా లేకుండా సంక్షేమ పథకాలకు కోత విధిస్తూ ఉపాధి హామీ పథకాన్ని నీరుగారిచే పద్ధతులలో బడ్జెట్ ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దుర్మార్గంగా ఉందన్నారు ఈ బడ్జెట్ కు వ్యతిరేకంగా ప్రజల్ని పోరాటాలకు సిద్ధం చేయాల్సినటువంటి అవసరం ఉందని అన్నారు రైతులకు ఏమాత్రం సబ్సిడీ లేకుండా ఎవరిని అన్యాయం చేశారని నక్సలైట్ల పేరుతో గిరిజనులను చంపుతూ ఖనిజ సంపదంత కార్పొరేటర్లకు అప్పగించాలని కుట్రలో భాగంగానే మీ హత్యాకాండము కొనసాగి స్తున్నారని మండిపడ్డారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మొదటినుండి బడ్జెట్ అన్యాయం చేస్తూనే ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు గాని ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డి మాట కూడా మాట్లాడకపోవడం అత్యంత దారుణం ప్రజల్ని ఐక్యంగా ఉంచాల్సిన కాంగ్రెస్ పార్టీ వాళ్ళు బాధ్యత లేకుండా ఉండడం వల్లే అన్ని రాష్ట్రాలలో ఎన్నికల ఫలితాలు స్పష్టమవుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 50 లక్షల కోట్ల బడ్జెట్లో కనీసం ఈ రాష్ట్రానికి 26 రూపాయలు కూడా కేటాయించలేదన్నారు ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాల్లో బడ్జెట్ను అధికంగా కేటాయించి దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం చేశారని అన్నారు బీహార్ ఉత్తరప్రదేశ్ ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ బడ్జెట్ కేటాయించడం వివక్షత కనిపిస్తుందన్నారు బడ్జెట్ ప్రవేశపెట్టేట ప్పుడు అప్పులు కూడా చూపెట్టాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉన్న అప్పులు చూపించకుండా బడ్జెట్ కేటాయించడం కనబడుతుం దన్నారు. ప్రభుత్వా లు పేదలకు ఇస్తున్న ఉచితలపై సుప్రీంకోర్టు జడ్జిలు మాట్లాడడం భావ్యం కాదన్నారు ఎస్సీ,ఎస్టీ బడ్జెట్ రాజ్యాంగ ప్రకారం 22 శాతం దామాషా ప్రకారం కేటాయించాల్సి ఉన్న ఆ దిశగా బడ్జెట్ కేటాయించకుండా ఎస్సీ ఎస్టీ పేదలకు అన్యాయం చేస్తుందన్నారు పేదరిక నిర్మూలన దిశగా బడ్జెట్ లేదని ఎస్సీ,ఎస్టీలకు బడ్జెట్ కేటాయించడంలో పూర్తి లోపం ఉన్నందువల్ల కనీసం జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు మన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సర్వే ప్రకారం 27 లక్షల మంది బాడుగ ఇళ్లలో ఉన్నారని చెప్పడం బాధాకరమన్నారు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ను ప్రజల కు తీసుకెళ్లడానికి దశల వారి జరగబోవు కార్యక్రమంలో భాగంగానే ఈరోజు కరపత్రాలు వాకర్స్ కు పంపిణీ చేయడం జరిగిందని రేపు తిరుపతిలో ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్నటువంటి అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహిస్తారని ఈ కార్యక్రమానికి వామపక్ష పార్టీల నుండి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవు తున్నారని ప్రజలు ఈ కార్యక్రమానికి పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కె.రాధాకృష్ణ , నగర కార్యదర్శి జై విశ్వనాథ్ , సిపిఎం నగర కార్యదర్శి వేణు, సెక్రటేరియట్ మెంబర్ సుబ్రహ్మణ్యం, బుజ్జి, మాధవ లక్ష్మి , సిపిఐ నాయకులు ఎన్ .వైయస్ మణి , గోవింద్ స్వామి నాగభూషణం అల్లాబక్షు హెూంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లు ముమ్మరం చేయండి

(మొదటి పేజీ తరువాయి) మహాశివరాత్రి పర్వదినాన వేలాది మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున క్యూలైన్లలో భక్తుల మధ్య తొక్కిసలాట జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లలో భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు వంటివి అందచేయాలని ఆయన ఆదేశించారు. దర్శనం విషయంలో సామాన్య భక్తులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని వినయ్ చంద్ ఆదేశించారు. ముక్కంటి ఆలయంలోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగే విధంగా చూడాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక బద్ధంగా ముందుకు పోవాలని ఆయన ఆదేశించారు. కాగా అంతకు మునుపు ముక్కంటి ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి అర్చకులతో కలసి దక్షిణ గోపురం వద్ద దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి వినయ్ చంద్ కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఈఈ మురళీధర్ రెడ్డి, ఏఈవో లోకేష్ రెడ్డి, ప్రోటోకాల్ ఏఈవో విద్యాసాగర్ రెడ్డి, ఏఈ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం కోసం ఆర్టీసీ బస్సును 20 రోజులు పాటు నెత్తకుప్పం వరకు తిప్పేందుకు అనుమతి ఇవ్వండి

విశాలాంధ్ర - తిరుపతి : రామచంద్రాపురం మండలంలోని నెత్తకుప్పం ప్రధాన రహదారి ఆర్ అండ్ బి రోడ్ గుంతలమయమై ప్రజలు ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నారు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కల్వర్టు వరకు రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు విడుదలైందని ప్రజలు ప్రయాణం సౌకర్యార్థం రోడ్డు నిర్మాణం పనుల కోసం 20 రోజులు పాటు తిరుపతి నుంచి నెత్తకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు తిప్పేందుకు అనుమతి ఇవ్వాలని నెత్తకుప్పం చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు ఆర్ టి సి అధికారులకు వినతి పత్రం సమర్పించారు ప్రత్యామ్నాయ రోడ్ ఏర్పాటు చేసుకోవాలన్నా రోడ్ ప్రక్కన ఉన్న రైతులు ప్రత్యామ్నాయ రోడ్ ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారని వినతి పత్రం లో విన్నవించారు చిత్తూరు-పెనుమూరు బస్సు వయా అనుప్పల్లి చంద్రగిరి మీదుగా తిరుపతి కి చేరుకునేందుకు విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రయాణం సులభతరం అవుతుందని తెలిపారు.

చర్యలు తప్పవు

విశాలాంధ -చిత్తూరు: ఎన్ టి ఆర్ వైద్య సేవ ద్వారా సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరం నందు ఎన్ టి ఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా సేవలందించే ఆరోగ్య మిత్ర లతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, సి హెచ్ సి లు, నెట్వర్క్ ఆసుపత్రులలో ఎన్టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా పేషంట్ లకు వైద్య సేవలు పొందడంలో ఆరోగ్యమిత్రలు పూర్తి సహాయ సహకారాలు అందించి వారి తోడ్పాటును అందించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం తగదని తెలిపారు. నెట్వర్క్ ఆసుపత్రులలో ఎన్టిఆర్ వైద్యసేవ ద్వారా వైద్య సేవలు పొందేందుకు వచ్చే పేషంట్ల నుండి సంబంధిత యాజమాన్యాలు నగదు రహిత వైద్యం అందించేలా ఆరోగ్యమిత్రలు చర్యలు చేపట్టాలన్నారు. నగదు రహిత వైద్యం పొంది డిశ్చార్జ్ అయిన పేషంట్ల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు సంబంధిత ఏఎన్ఎం లకు సమాచారం అందించి వారి వారికి సంబంధించిన సమాచారాన్ని యాప్ నందు అప్ లోడ్ చేసేలా ఆరోగ్యమిత్రలు సమన్వయం చేసుకోవాలని, ఈ విషయంలో మెడికల్ ఆఫీసర్ల సహకారంతో ముందుకు వెళ్లాలని ఎన్టిఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డా.సుదర్శన్ ను ఆదేశించారు. ఆరోగ్య మిత్రలు సమయపాలన పాటించాలని, విధులను భాద్యతతో సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన మాజీ సర్పంచ్



విశాలాంధ్ర-రేణిగుంట: మండలంలోని మేజర్ పంచాయతీలలో ఒకటైన గాజులమండ్యం పంచాయితీ అభివృద్ధి పనులకు కావలసిన నిధులను కేటాయించాలని మాజీ సర్పంచ్ శ్రీ రాజ్ జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ను మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలసి వినతి పత్రం ఇచ్చి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా పాలనలో పంచాయితీ అభివృద్ధిలో వెనుకబడిందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి సమక్షంలో పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అందులో భాగంగానే కలెక్టర్ ను కలిసి సమస్యలపై వివరించామని తెలిపారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు.

నారా లోకేష్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తిరుపతి పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా,ఐటీ శాఖ మంత్రి పద్మావతి మహిళా మహిళా విశ్వవిద్యాలయం నందలి 5.70 కోట్ల రూపాయలతో నిర్మించబడిన మల్టి పర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను బుధవారం మధ్యాహ్నం 2.15 గంటలకు ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, శ్రీ పద్మావతీ మహిళా విశ్వ విద్యాలయం వి.సి. ఉమ, రిజిస్ట్రార్ రజినీ తదితరులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, తహశీల్దార్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించిన దుకాణాలు

పాత పోస్టాఫీసు వీధిలో ఇదీ పరిస్థితి

పట్టించుకోని అధికారులు - తప్పని ట్రాఫిక్ చిక్కులు

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కా రానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నా కొన్ని చోట్ల మాత్రం పట్టించుకోవడం లేదు. పట్టణ నాలుగు మాఢవీ ధుల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా మహాశివరాత్రి ఉత్సవంలో రథోత్సవానికి ఇబ్బందులు లేకుండా ఉండాలని స్వయంగా ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి రోడ్డు ముందు కొచ్చిన అక్రమణలను తొలగించాలని దుకాణదారులకు విన్నవించారు. స్పందించిన వారు స్వచ్ఛందంగా రోడ్డు ముందుకొచ్చిన ఆక్రమణలను తొలగించి అభినందనలు అందుకున్నారు. అభివృద్ధికి తాము కూడా సహకరిస్తామని చాటిచెప్పారు. అయితే కొన్ని చోట్ల ఈ మార్పు రావడం లేదు. తమ దుకాణాన్ని రోడ్డుకు ముందుకొచ్చి సామగ్రిని పెడుతున్నారు. తమ కళ్లముందే వాహన రాకపోకలకు తమ వల్ల ఇబ్బంది వస్తోందని కనిపిస్తున్నా నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ తమ పని తాము చేసుకుపోతున్నారు. ప్రధానంగా మాఢ వీధుల నుంచి పాత పోస్టాఫీసు రోడ్డు గుండా పాత బజారు సినిమాహాలువీధికి వెళ్లే మార్గంలో ఈ పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ బస్టాం డు, పెద్దమసీదు వీధితో పాటు పలు మార్గాల గుండా మాఢవీధుల్లోకి వచ్చే వాహనాలు ఎక్కువగా ఈ దారి గుండా రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఈ మార్గంలో రోడ్డును ఆక్రమించి కొంత మంది దుకాణదారులు తమ దుకాణ సామగ్రిని పెట్టి వాహన రాకపోక లకు అంతరాయం కలిగిస్తున్నారు. ఈ విషయమై స్థానికులు పలువురు ప్రశ్నించినా దౌర్జన్యం చేస్తూ తమ పబ్బం గడుపుతున్నట్లు చెబుతున్నారు. అధికారుల దృష్టికి సమస్యల వెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదంటున్నారు. దీంతో నిత్యం ఈ మార్గంలో ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహన దారులు కోరుతున్నారు.

జాతీయ రహదారి నుంచి గ్రామాలకు దారి ఇవ్వండి

- కలెక్టర్‌కు ఎమ్మెల్యే, రైతులు వినతి

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : చంద్రగిరి నియోజకవర్గంలోని చిన్నగొట్టిగల్లు మండలంలో ఉన్నటువంటి తిరుపతి- అనంతపురం జాతీయ రహదారి ప్రక్కన చిన్న గొట్టిగల్లు మండలంలోని పలు గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించి, రోడ్డు సమస్యను తీర్చాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతి కలెక్టరేట్ లో ఎమ్మెల్యే పులివర్తి నాని ద్వారా జిల్లా కలెక్టర్ ను కలసిన చిన్నగొట్టిగల్లు మండలంలోని పలువురు రైతులు, నాయకులు, ప్రజలు తిరుపతి - అనంతపురం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో దారి లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పలు పంచాయతీలకు దారి కల్పిస్తామని మెగా సంస్థ గతంలో హామీ ఇచ్చిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే పులివర్తి నాని, గ్రామ ప్రజలకు తగు న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరారు. ఈ విషయాలన్నింటినీ కలెక్టర్ పరిశీలించి తగు న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిన్న గొట్టిగల్లు మండల, రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కొట్టే శివకుమార్, రమణారెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలిక మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

విశాలాంధ్ర - పలమనేరు : మండలంలోని టి.ఒడ్డూరులో చదువుకుంటున్న బాలికపై కామాంధుడు అత్యాచారం చేయడంతో బాలిక గర్భం దాల్చి బిడ్డకు జన్మనిచ్చి ఆసుపత్రిలోనే ప్రాణాలు విడవడం జిల్లాలోని ఆడబిడ్డల తల్లిదండ్రులను భయభ్రాంతులకి గురిచేసింది.రాష్ట్రంలో ప్రతి రోజు ఏదో ఒక చోట మహిళలు, ఆడబిడ్డలపై హత్యలు, దాడులు, అత్యాచారాలు చోటు చేసుకుం టుడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తుందని విస్మయం వ్యక్తం చేశారు.. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసామని చెప్పి చేతులు దులుపుకోకుండా భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని.. బాధితురాలికి అండగా నిలవాలి. అప్పటివరకూ వైయస్ఆర్ సీపీ పోరాడుతూనే ఉంటుందని, ఆడబిడ్డలపై చెయ్యి వేయాలంటే భయపడే రీతిలో ఎందుకు చట్టాన్ని కూటమి ప్రభుత్వం తీసుకురాలేకపోతోంది? గతంలో వైయస్ జగన్ గారు దిశా చట్టం తీసుకొచ్చి ఆడబిడ్డలకు రక్షణగా నిలిచారు. కానీ ఇప్పుడు ఆ చట్టాన్ని గాలికి వదిలేయడంతోనే ఈ అరాచకాలు జరుగుతున్నాయని తెలిపారు.

మన్నారు పోలూరు ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మన్నారు పోలూరు నందు అగస్త్య ఫౌండేషన్ వాళ్ళు పాఠశాల విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులైన శ్రీ సిహెచ్ రాజశేఖర్ రెడ్డి చే సైన్స్ ఫెర్ ప్రారంభించినారు పాఠశాలల్లో పనిచేసే సైన్స్ టీచర్లు శ్రీ ఎస్ కే అక్బర్ శ్రీమతి ఎన్ శ్యామల మరియు సునీల అగస్త్య ఫౌండేషన్ సంబంధించి ఉపాధ్యాయులు నీరజ పోలమ్మ వారి సారథ్యంలో పై కార్యక్రమం జరిగినది ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులందరూ పాల్గొని ఆనందంగా పాల్గొన్నారు వీటిని అందరినీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

బంగారమ్మ ఆలయంలో చిన్నారి తులాభారం

విశాలాంధ్ర - కార్వేటినగరం: శ్రీ బంగా రమ్మ దేవస్థానం నందు కార్వేటి నగర్ వాస్తవ్యులు శ్రీమతి శ్రీ కావేరి పురుషోత్తం మొదలియార్ మనువ డు చిరంజీవి తేజేశ్వ రికి తులాభారం నిర్వహిం చడం జరిగింది. ఈ తులా భారం ద్వారా దేవస్థానమునకు 2500 రూపాయలు చిరంజీవి తేజేశ్వ రీ తల్లిదండ్రులు శ్రీ రాజేశ్వరి ధన శేఖర్ మొదలియార్ తన ముదువు అమ్మవారికి సమర్పిం చుకున్నారు. ఈ నగదు ను దేవాలయ కార్యక్రమాలకి వినియోగించినట్లు దేవస్థానం అధ్యక్షులు కొప్పేటి ప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యు లు రంగనాథ మొదలియార్, చంద్రశేఖర్, రామశెట్టి రాజశేఖర్ భక్తులు పాల్గొన్నారు.

అర్హులైన అంగన్వాడి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - తిరుపతి: ఐసిడిఎస్ ప్రాజెక్టు వెంకటగిరి లో అంగన్వాడీ కార్యకర్త అంగన్వాడీ సహాయకురాలు ఖాళీగా ఉన్న పోస్టులకు రెండు అంగన్వాడి కార్యకర్తలు మరియు 11 అంగన్వాడీ సహాయకరాల పోస్టులో అప్లికేషన్లో ఐసిడిఎస్ కార్యాలయం జరిగింది అందులో అర్హులైన అభ్యర్థులు ఉదయం 9 గంటలకు వాళ్ల ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పదో తరగతి సర్టిఫికెట్ ఎమ్మార్వో గారికి తీసుకోబడిన నేటివ్ సర్టిఫికెట్ ఆధార్ కార్డు అన్ని ఒరిజినల్ తీసుకొని 19వ తేదీ ఆర్డిఓ కార్యాలయం గూడూరులో హాజరు కావలసినదిగా అంగన్వాడి సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు మొత్తం వచ్చిన అప్లికేషన్లో 41 వీటిలో 35 మంది అర్హత సాధించారు వీరికి కాల్ లెటర్స్ ఇవ్వడం జరిగింది అని తెలిపారు.

ఏపిపిటిడి (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ చిత్తూరు జిల్లా విస్తృత స్థాయి సమావేశం

విశాలాంధ్ర - పలమనేరు :పట్టణంలోని చరణ్ కన్వెన్షన్ హాల్ నందు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ, ఆర్టీసీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు చర్చించుకోవడం, అలాగే పలు కీలక సూచనలు సలహాలు తీసుకో వడం జరిగిందన్నారు. ప్రతి ఒక్క సభ్యుడికి వృత్తి విషయంలో అన్యాయం జరగకుండా యూనియన్ సభ్యులు సకాలంలో స్పందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అమరా వతి ఆర్టీసీ జేఏసీ పలమనేరు డివిజనల్ అధ్యక్షుడు బాలకృష్ణ, పలమనేరు డిపో గౌరవ అధ్యక్షుడు సుధీర్, చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్నాథం, బలరామమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, జోనల్ కార్య దర్శి రాజశేఖర్, చిత్తూరు జిల్లా జోనల్ కమిటీ సభ్యులు మధు, అన్వర్ ఖాన్, సీనియర్ నాయకులు మురళీధరన్, జిల్లా కమిటీ సభ్యులు 5 డిపోల నాయకులు గ్యారేజ్ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు ఇ.యు శ్రేణులు పాల్గొన్నారు.

వారణాసిలో వైభవంగా శ్రీనివాస కళ్యాణం

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : మహా కుంభమేళా సందర్భంగా వారణాసిలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలోని బిర్లా మందిర్ లో మంగళవారం శ్రీ శ్రీనివాస కళ్యాణాన్ని టీటీడీ అంగరంగ వైభవంగా నిర్వహించింది. ముందుగా అర్చక బృందం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీస్వామివారి ఉత్సవర్లను కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ విష్వక్సేనారాధన, పుణ్యాహ వచనం, కంకణ ధారణ, అగ్నిప్రతిష్టాపన, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మహా సంకల్పం,మాంగళ్యపూజ,మంగళసూత్రధారణమొదలయిన ఘట్టాలతో శాస్త్రోక్తంగా శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యాణాన్ని నిర్వహించారు. చివరిగా శ్రీ స్వామి అమ్మవార్లకు నక్షత్ర హారతి, మంగళ హారతి సమర్పించడంతో కళ్యాణం దిగ్విజయంగా ముగిసింది. శ్రీవారు, అమ్మవార్ల కళ్యాణ ఘట్టాన్ని నేత్రపర్వంగా తిలకించిన భక్తులు భక్తి పరవశంతో పులకించారు. అనంతరం బిర్లా మందిర్ వద్దకు శ్రీ స్వామి వారిని వేంచేపు చేసి హారతి సమర్పించగా, టీటీడీ ఈవో జె.శ్యామల రావు చేతులు మీదుగా పట్టు వస్త్రాలు సమర్పిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెచ్ డీపీపీ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజ గోపాల్, పారు పత్తేదార్ బాల సుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాలిక మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర – పలమనేరు : పలమనేరు రూరల్ మండలం టీ ఒడ్డురు గ్రామంలో సునీత అనే బాలికపై అత్యాచారం చేసి గర్భవతై మరణానికి కారణమైన ఉన్మాదులను కఠినంగా శిక్షించాలని జాతీయ మానవ హక్కుల అనుబంధ మహిళా సంఘం అధ్యక్షురాలు సరస్వతి డిమాండ్ చేశారు. అందులో భాగంగా మంగళవారం పలమనేరు పట్టణంలో గల మానవ హక్కుల కార్యాలయం నందు రుక్మిణి అధ్యక్షతన జరిగిన సంఘటన పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల జిల్లా నాయకులు డి.వి. మునిరత్నం మాట్లాడుతూ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి లైంగికంగా వాడుకోవడం వలన 9 నెలలు గర్భవతిని చేయడం దుర్మార్గమన్నారు. బాలికకు వయసు మెచ్యూరిటీ కాకపోవడంతో డెలివరీ అయిన వెంటనే ఎక్కువ రక్తహీనతకు గురై మరణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కొంత మంది మధ్యవర్తులు వలన అనేకమంది చిన్నారులు బలైపోతున్నారని తెలిపారు. సునీత విషయంలో కూడా అదే గ్రామానికి చెందిన ఓ మధ్యవర్తి ముఖ్య పాత్ర వహించినట్లు గ్రామస్తులు ద్వారా సమాచారం తెలిసిందన్నారు. శ్రీదేవి మాట్లాడుతూ నిత్యం రెక్కల కష్టంతో బతికే పిల్లల తల్లిదండ్రులు ఆడపిల్లల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో ఉండాల్సింది ఎంతైనా ఉందన్నారు . ఆడపిల్లలు క్రమం తప్పకుండా నెలసరి కార్యక్రమం జరుగుతున్నదా లేదా చూడాల్సిన బాధ్యత ప్రతి ఆడబిడ్డ తల్లిపై ఉందన్నారు. కార్యదర్శి మణి, సోమశేఖర్ మాట్లాడుతూ టీ ఒడ్డురు గ్రామంలో ఇంతకు మునుపు ఇలాంటి సంఘటనలు జరిగినట్లు గ్రామస్తులు బహిరంగంగా చెప్పుకోవడం ఆ విషయాల్లో కూడా న్యాయం జరగలేదని వాపోతున్నారు. అప్పుడైనా పిల్లలు తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లితండ్రులు ఆడపిల్లలను ఒంటరిగా ఇళ్ల వద్ద వదలకుండా చదువుపై శ్రద్ధ చూపేటట్లు ప్రయత్నించాలన్నారు. పార్ధసారథి,గుర్రం, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సునీత విషయంలో పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాలిక మృతికి కారణమైన దుర్మార్గులను కఠినంగా శిక్షించే విధంగా సెక్షన్లు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి బాధ్యత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు.

సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర –తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం పరిధిలోని తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రగిరి, తిరుపతి,రామచంద్రాపురం, పాకాల మండలాల పరిధిలోని పలువురికి సిఎంఆర్ఎఫ్ సహాయ నిధి ద్వారా సుమారు 35 లక్షల 48వేల 696 రూపాయిల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం పంపిణీ చేశారు. అనారోగ్య ,ఇతర సమస్యలతో బాధపడుతున్న విషయం స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనారోగ్య, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయాలని ఉన్నత అధికారులకు ఆదేశించారు. సీఎం ఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పులివర్తి నాని అందించారు. కష్టకాలంలో మా కుటుంబాన్ని అదుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నాని కి బాధిత కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల మెస్ సమస్యలను పరిష్కరించాలి

- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇంచార్జ్ విసి అప్పారావుకి వినతిపత్రం

విశాలాంధ్ర– తిరుపతి : ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్వీ యూనివర్సిటీ ఇంచార్జ్ ఉపకులపతి (విసి) అప్పారావు ని కలిసి హాస్టల్ లో నాణ్యమైన భోజనం అందించడం లేదని జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్ , ఎస్వీ యూనివర్సిటీ కార్యదర్శి చంద్రనాయక్ మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్, వర్కర్స్ నిర్లక్ష్యంతో నాణ్యమైన భోజనం అందించడం లేదని వారు మాట్లాడారు. ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ విద్యార్థుల మెస్ బిల్లులు వేల రూపాయల్లో విపరీతంగా పెంచి విద్యార్థుల కి నాణ్యమైన భోజనం అందించలేక ద్రోహం చేస్తున్నన్నారు. 2020 కరోనా ముందు విద్యార్థులకి ప్లేట్, గ్లాస్, శుభ్రపరచుకోవడానికి వేడి నీరు అందించే వారు ఇప్పుడు విద్యార్థులకి ఎవరి వారే ప్లేట్, గ్లాస్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు నెలల క్రితం ఎస్వీ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు మెస్ ముందు ఆందోళన చేస్తే రిజిస్టర్ అక్కడికి వచ్చి విద్యార్థు లతో మాట్లాడి సమస్యను సానుకూలంగా స్పందించి రెండు వారాలలో పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అయినా కూడా రెండు నెలలు గడిచిన కూడా విద్యార్థులకి ఎలాంటి సమస్య తీరడం లేదు. విద్యార్థుల దగ్గర వేల రూపాయలు వసూలు చేస్తూ వారికి నాణ్యమైన భోజనం అందించకుండా విద్యార్థుల పొట్ట కొడుతూ చదువుకునే విద్యార్థులకి అన్నం కూడా పెట్టలేని పరిస్థితిలో పేరుపొందిన యూనివర్సిటీ చెప్పుకునే ఉన్నత అధికారుల యొక్క విలాస వంతమైన జీవితాన్ని గడుపుకుంటూ పేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని వారు మాట్లాడారు. మరోవైపు ఆర్ట్స్ విద్యార్థుల మెస్ మెనూ ను కామన్ మెనూ ను అమలు చేయాలని విసి కి వినతిపత్రం అందచేయడం జరిగింది. యూనివర్సిటీ అధికారులు తొందరలో మెస్ కమిటీ ఏర్పాటు చేసి విద్యార్థుల యొక్క మెస్ సమస్యలను పరిష్కారం చేయాలని ఏఐఎస్ఎఫ్ కోరారు. లేనియెడల యూనివర్సిటీ విద్యార్థులను ఏకం చేసి ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ సహాయ కార్యదర్శి నరసింహ, ఉపాధ్య క్షులు రాజు, బ్లాక్ కన్వీనర్ ఉదయ్, కో కన్వీనర్ శశి, నాయకులు ప్రశాంత్, కిషోర్ శాంతి రెడ్డి, కిస్ బాబు, మనోహర్, నరసప్ప, గణేష్, ప్రశాంత్ పాల్గొనడం జరిగింది.

మార్చి8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర – గూడూరు : మార్చి8 న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మి పర్వీన్ సుల్తానా బేగం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసుల శాశ్వత పరిష్కారానికి రాజీయే రాజా మార్గం అని పిలుపునిచ్చారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో సివిల్, క్రిమినల్, బ్యాంక్, బి.ఎస్. ఎన్.ఎల్ ,ఎలక్ట్రి సిటీ కేసులు , భూ తగాదాలు , ఇతర కేసులను రాజీ మార్గంలో ఇరు వర్గాల సమ్మతితో రాజీ చేస్తామని తెలిపారు. కక్షి దారులు ఈ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాజేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.వి.సులోచన రాణి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శంకరయ్య, సీనియర్ ఏ.పి.పి లక్ష్మి నారాయణ, భాస్కర్ రావు, డిఎస్పీ గీతా కుమారి, లాయర్లు కోటేశ్వర రావు, మహబూబ్ బాషా, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర – పుత్తూరు: తిరుపతిలో మార్చి 4, 5 తేదీల్లో నిర్వహించే వీధి వ్యాపారుల సంఘం తిరుపతి జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ శివ కుమార్, ఏఐటియుసి నాయకులు మహేష్ కోరారు. పుతూరు పట్టణం నందు రాజరాజేశ్వరి టెంపుల్ వద్ద మంగళవారం మహాసభల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పట్టణ పరిధిలో చిన్న చిన్న వ్యాపారస్తుల నుండి, తోపుడు బండ్ల వ్యాపారుల నుండి అక్రమ గేటు వసూలు చేస్తూ వారిని అనేక ఇబ్బందులు పెడుతున్నారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవలసిన అధికారులే వారికి సపోర్ట్ చేస్తు వ్యాపారుల కడుపు కొడుతున్నారు. వీధి వ్యాపారుల పట్ల అధికారులు అనుసరిస్తున్న తీరు బాధాకరమన్నారు. దీనిపై మహాసభల్లో చర్చించి, తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. 3800 మందికి పైగా విక్రయ దారులను గుర్తించిన పుత్తూరు మున్సిపల్ వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయడానికి మాత్రం సమయం లేకపోవడం చాలా దుర్మార్గమన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సైతం లెక్క చేయని అధికారులను కలెక్టర్ చొరవ తీసుకొని అటువంటి అధికారులపై చర్యలు తీసుకొని వ్యాపారులకు అండగా ఉండాలని కోరారు. ఈ కరపత్రాల విడుదల కార్యక్రమంలో వీధి వ్యాపారుల సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు నజీర్, నవీన్ కుమార్, అమ్ములమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ బిల్లా మజాకా

విశాలాంధ్ర – బైరెడ్డిపల్లి : ప్రజలు వస్తుంటారు పోతుంటారు, రాజకీయ నాయకులు మాత్రం వచ్చేస్తూనే ఉంటారు. ప్రజల ఇబ్బందులను ఆసరా చేసుకుని ప్రతిపక్షం విమర్శించడం అధికారంలోకి వచ్చిన తర్వాత గత పార్టీ చేసిన తప్పులనే కొనసాగించడం షరామాములే .ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కరెంటు బిల్లుల బాదుడు ,బస్సు చార్జీల బాదుడు ,చెత్త పన్నుల బాదుడు అంటు కితాబు ఇచ్చి ప్రస్తుతం అధికార పార్టీ మాత్రం ఇదే బాదుడిని కొనసాగిస్తున్నది. కరెంటు బిల్లులు మోతతో సగటు మానవుడు బిల్లు పై రెండు వందలు అదనంగా చెల్లించుకోవలసి వస్తున్నది. ఒక వినియోగదారుడు నెలకు 69 యూనిట్స్ వాడితే ఒక యూనిట్కు రెండు రూపాయల యాభై పైసలు చొప్పున 175 రూపాయల బిల్లు రావాలి. కానీ అతనికి వచ్చిన బిల్లు 382 రూపాయలు . ఆచార్జీలు ఈ చార్జీలు అన్ని కలుపుకొని 207 రూపాయలు అదనంగా వినియోగదారుడు చెల్లించవలసి వస్తున్నది. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం బాదుడు తగ్గించి ప్రజలను ఆదుకోవాలని రెండు వందల యూనిట్లు వరకు ఉచిత కరెంటు ఇస్తామన్న నాయకులు ఉచితం పక్కనపెట్టి కనీసం ఆచార్జీలు ,ఇంచార్జీలను తగ్గిస్తే బాగుంటుందని మండలంలోని వినియోగదారులు తమ ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు.

ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్

విశాలాంధ్ర– తిరుపతి : భారతదేశంలోని 6 వేదికలలో 517 మంది అభ్యర్థులు పాల్గొనగా "అతిపెద్ద పశువుల సంక్షేమ పాఠం (బహుళ వేదికలు)" కోసం ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించడం ద్వారా చరిత్ర సృష్టించిందని సంస్థ ప్రతినిధులకు ప్రకటన తెలిపారు. భారతదేశంలో, గ్రామీణ ప్రాంత జనాభాలో దాదాపు 65–70 శాతం మంది తమ జీవనోపాధి కోసం వ్యవసాయం లేదా వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలపై ఆధారపడుతున్నారన్నారు. అందువల్ల, వారి జీవనోపాధి ఉత్పత్తి కార్యకలాపాలు ఆర్థిక శ్రేయస్సులో పశువులు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ విడదీయరాని బంధాన్ని గుర్తించి, ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ 7వ ఎడిషన్ పశు వికాస్ దినోత్సవాన్ని "మేరా పశు మేరా పరివార్" అనే నేపథ్యంతో జరుపు కుందని స్పష్టం చేశారు. ఇది ఈ గ్రామీణ కుటుంబాల జీవితాల్లో పశువుల ప్రాముఖ్యతను పునరుద్ఘాటించిందన్నారు. ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్ శంతను మిత్రా మాట్లాడుతూ, "ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్‌లో, అర్థవంతమైన ప్రభావాన్ని సృష్టించే సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ స్వామినాథన్ సుబ్రమణియన్ మాట్లాడుతూ " పశు వికాస్ దినోత్సవాన్ని వరల్డ్ రికార్డ్స్ యూనియన్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, బెస్ట్ ఆఫ్ఇండియారికార్డ్స్‌వరల్డ్‌బుక్స్‌ఆఫ్‌రికార్డ్స్‌కూడా గుర్తించాయన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర – గూడూరు : గూడూరు పట్టణం లోని మాళవ్యనగర్ ప్రాంతంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ నందు జిల్లా మెడికల్ ప్రోగ్రాం ఆఫీసర్ , పట్టణ పరిధిలోని వైద్య సిబ్బంది తో ఆరోగ్య సమస్యలపై చర్చించి ప్రజల పట్ల హాస్పిటల్ సిబ్బంది తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియ చేశారు. ఈ సమావేశానికి అర్బన్ హెల్త్ సెంటర్ నూతన ఛైర్మెన్ ఎం.డి. అబ్దుల్ రహీం ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి, అంటు వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అర్బన్ హెల్త్ సెంటర్ కు వచ్చే రోగులు అధిక శాతం పేద వారే వస్తారని, వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా మెరుగైన వైద్యం అందించి, ప్రభుత్వం సరఫరా చేసే మందులు అందుబాటులో ఉంచాలని దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ సమావేశంలో అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్స్, వైద్య సిబ్బంది, పట్టణ పరిధి లోని ఎ.ఎన్.ఎం. లు, శానిటరీ సెక్రటరీ లు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్చార్జిల చక్రబంధంలో మదనంబేడు సచివాలయం

పనులు పూర్తి కావాలంటే మండల కేంద్రానికి పరుగులు తీయాల్సిందే

విశాలాంధ్ర -సత్యవేడు: ప్రజలకు వారున్న ప్రాంతాల్లోని పౌర సేవలను సులువుగా అందించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. దీనికోసం సిబ్బందిని కూడా నియమించింది. ఒక్కో సచివాలయంలో ఐదు నుంచి పదిమంది వరకు పనిచేస్తున్నారు. అయితే ప్రస్తుతం సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి కూడా బదిలీల అవకాశం కల్పించడంతో వారికి అనుకూలమైన ప్రాంతాలకు కొందరు వెళ్లిపోయారు. అయితే వాటి స్థానంలో సిబ్బంది భర్తీ కాకపోవ డంతో కొన్ని సచివాలయాలు ఇన్చార్జ్ మయంగా మారుతుంది. ఇందుకు తిరుపతి జిల్లా సత్యవేడు మండలం మదనంబేడు సచివాలయమే నిదర్శనంగా నిలుస్తుంది. ఇదొక మేజర్ పంచాయతీ సచివాలయం. అయినా ఇన్చార్జి చక్రబంధంలో సచివాలయ పాలన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పుదుకుప్పం పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న మాధవి మదనంబేడు ఇన్చార్జి పంచాయతీ సెక్రటరీగా కొనసాగుతున్నారు. అలాగే ఏఎం పురం వీఆర్వో పనిచేస్తున్న వినోద్ కుమార్ ఇక్కడ ఇంచార్జ్ వీఆర్వోగా పనిచేయగా, అదే సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్గా పని చేస్తున్న వినోద్ కూడా ఇక్కడ ఇంచార్జ్ వెల్ఫేర్ అసిస్టెంట్ పనిచేస్తున్నారు. దీంతోపాటు సిరణంబుదురు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్గా పని చేస్తున్న సందీప్కు మదనంబేడు సచివాలయ ఇంచార్జ్ అసిస్టెంట్ ఇంజనీరింగ్ బాధ్యతలను అదనంగా అప్పగించారు. అలాగే ఆరూరు సచివాలయంలో సర్వేయర్గా పనిచేస్తున్న మధుకు ఇక్కడ ఇన్చార్జ్ సర్వేర్గా కొనసాగుతున్నారు. ఇక మదనంబేడు సచివాలయంలో రెగ్యులర్ ప్రాతిపదికన డిజిటల్ అసిస్టెంట్ యామిని, హార్టికల్చర్ అసిస్టెంట్గా మురళి, వెటర్నరీ అసిస్టెంట్గా జ్యోతి, మహిళా పోలీస్గా దుర్గాభవాని కొనసాగుతున్నారు. అయితే మేజర్ పంచాయతీ మదనంబేడు సచివాలయంలో ప్రధానమైన సెక్రటరీ, వీఆర్వో, వెల్ఫేర్, సర్వేయర్ పోస్టులకు సంబంధించి వేరొక సచివాలయంలో పనిచేస్తున్న వారికి ఇన్చార్జ్ బాధ్యతను ఆపగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా తొమ్మిది మందిలో ఏకంగా ఐదుగురు ఇన్చార్జిలుగా కొనసాగుతున్నడంతో సచివాలయమే బోసిపోతుంది. ఇన్చార్జీలు ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారు అనేది అంతుచిక్కనే ప్రశ్న. తద్వారా ఇక్కడ సచివాలయం ఉన్న పౌర సేవలు ప్రజలకు అందని ద్రాక్షలా మిగులు మిగిలిపోతుంది. ఇక్కడ సచివాలయం ద్వారా పనులు పూర్తి చేసుకోవాలన్న వీలుకాని పరిస్థితి ఏర్పడుతోంది. పనులు పూర్తి కావాలంటే మళ్లీ యధావిధిగా మండల కేంద్రానికి ప్రజలు పరుగులు తీసే పరిస్థితి లేకపోలేదు ఇప్పటికైనా దీనిపై సంబంధిత అధికారులు స్పందించి రెగ్యులర్ ప్రాతిపదికన ఇక్కడ అధికారులను నియమించడానికి చర్యలు తీసుకొని ప్రజలకు సేవలు సక్రమంగా అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఈనెల 21న

డిఆర్ డబ్ల్యు కళాశాలలో జాబ్ మేళా

విశాలాంధ్ర - గూడూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజ్, సీడ్ఆఫ్ మరియు డి ఆర్ డి ఎ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21 న గూడూరు పట్టణంలోని డి ఆర్ డబ్ల్యు కలశాల లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్య భి వృద్ధి జిల్లా అధికారి లోక నాథం, కలశాల ప్రిన్సిపాల్ హనుమంత రావు లు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో బహుళ జాతీయ కంపెనీలైన గ్రీన్ టెక్ , వీల్స్ ఇండియా , బ్లూ స్టార్ , క్లయి మాటేక్, ఇంటెల్ సర్వీస్ , ముత్తూట్ ఫైనాన్స్ , మొదలగు కంపెనీలలో ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడును అన్నారు. పదవ తరగతి , ఇంటర్మీడియట్ , ఐటిఐ , డిప్లమా , ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులు అని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు ఆధార్ కార్డు జిరాక్స్ , విద్యార్హత సంబందించిన సర్టిఫికెట్స్ జిరాక్స్ , బయోడేటా ఫామ్ తో పాటు క్రింద ఇచ్చిన రిజిస్ట్రేషన్ లింక్ లో తప్పనిసరిగా నమోదు చేసుకొని కచ్చితంగా అడ్మిట్ కార్డు తో జాబ్ మేళాకు హాజరు కావలెను అని ఆర్ లోకనాథం, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి తిరుపతి జిల్లా డి ఆర్ డబ్ల్యు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు ప్రకటనలో తెలియజేశారు. రిజిస్ట్రేషన్ లింకు:https: //naipunyam.ap.gov.in/ లో వివరాలు నమోదు చేసుకొని ,అడ్మిట్ కార్డు తో రావలెను అన్నారు. మరిన్ని వివరములకు 8639835953 మొబైల్ నెంబర్లను సంప్రదించగలరు అని పేర్కొన్నారు.

ప్రతి కార్యకర్త జ్ఞాన జ్యోతిగా వెలగాలి

- విద్యాశాఖ అధికారులు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : ప్రతి అంగన్వాడి కార్యకర్త జ్ఞాన జ్యోతి గా పిల్లల జీవితంలో మెరుగులు దిద్దాలని మండల విద్యాశాఖ అధికారులు కే రవీంద్రనాథ్, రెండవ విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్వాడి కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి 120 రోజులు దృవపత్రాల శిక్షణ తరగతులు ప్రధానోపాధ్యాయుడు కె.రమణయ్య అధ్యక్షతన నిర్వహించారు, డి.ఆర్.పి లు పవిత్ర, శివశంకర్, రమేష్ లు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ, మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీ ప్రైమరీ స్కూల్లో బోధించడానికి జ్ఞాన జ్యోతి 120 రోజుల కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలందరికీ ఐదు అంశా లు, ఆరు రోజులు విద్యశాఖ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం ఇవ్వడం జరుగుతుంది. శారీరకాభివృద్ధి, మేధాబివృద్ధి, సామాజిక భావోద్వేగాభివృద్ధి, భాషాభివృద్ధి, సౌందర్య మరియు సాంస్కృతికాభివృద్ధి, అలాంటి లక్ష్యాలు అంగన్వాడి సెంటర్లు అమలుపరిచే విధంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ యమునా, జ్యోతి లో పాల్గొన్నారు.

సురుటుపల్లెలో అట్టహాసంగా ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

తొలిరోజు గ్రామదేవత పొన్నెమ్మకు పూజలు గ్రామోత్సవం

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు నియోజక వర్గం నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణఅధికారి లత ఆధ్వర్యంలో తొలిరోజు గ్రామ దేవత పొన్నెమ్మకు పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేసన్ ఆధ్వర్యంలోనే అర్చక బృందం ఉదయం 7:30 కు గ్రామదేవత పొన్నెమ్మకు శాస్త్రక్తంగా అభిషేకం నిర్వహించి వివిధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం మహాదీపారాధన చేశారు. అనంతరం 9 గంటలకు విఘ్నేశ్వర స్వామికి పూజలు చేసిన తర్వాత సాయంత్రం నాలుగు గంటలకు వాస్తు శాంతి జరిపారు. రాత్రి 7 గంటలకు గ్రామదేవత ఉత్సవమూర్తిని మంగళ వాయిద్యాలు, భక్తుల సందడి మధ్య మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహిం చారు. గ్రామోత్సవ వేడుకలలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా ఆలయంలో ఫిబ్రవరి 18వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనుంది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 19వ తేదీ ధ్వజారోహణం, పల్లకి వాహనంపై స్వామి వారి ఊరేగింపు, 20 తేదీన చంద్రప్రభవాహనం, 21న కామ దేను వాహనం, 22వ తేదీన భూతవాహనం, 23న అధికారనంది వాహనం, 24న గజవాహనం, 25న అశ్వవాహనం, 26న వృషభ వాహనం, 27న కల్పవృక్ష వాహనం, 28న త్రిశూల స్థానం, రావణబ్రహ్మ వాహనంపై శ్రీమరగదాంబిక వాల్మీకేశ్వరస్వామి ఉత్సవమూర్తులు మాడవీధుల గుండా ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తూ కనువిందు చేయనున్నాయి.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించండి

మండల మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.5వేలు బహుమతి

- డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: విద్యార్థులు శ్రద్ధతో చదివి 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలని... మండల మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.5వేలు బహుమతి అందచేస్తానని ప్రముఖ సంఘ సేవకులు, శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు యల్లంపాటి కోటేశ్వరబాబు చెప్పారు. వచ్చే నెలలో 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానుండటంతో... మంగళవారం ఆయన శ్రీకాళహస్తి మండల పరిధిలోని అక్కుర్తిలో 28మంది, ముచ్చివోలులో 41మంది, వెలంపాడులో 25మంది... మొత్తం 94మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా యల్లంపాటి కోటేశ్వరబాబు మాట్లాడుతూ... తాను నిరుపేద కుటుంబంలో జన్మించినప్పటికీ... విద్యార్థులకు తనవంతు సహకారం అందివ్వాలనే ఆశయంతో ప్రతియేటా విద్య, పరీక్ష సామాగ్రి అందచేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించాలనే ఆశయంలో తాను ప్రతి యేటా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు కోటేశ్వరబాబు చెప్పారు. విద్యతో పేదరికం జయించవచ్చన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో తమ పిల్లలను పాఠశాలకు పంపుతార న్నారు. వారి ఆశలకు అనుగుణంగా విద్యార్థులు చదువుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య లభిస్తుందని... ఈ పాఠశాలల్లో చదువుకున్న ఎంతో మంది నేడు ఎన్నో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. విద్యార్థి దశలో 10వ తరగతి చాలా కీలకమైందన్నారు. ఈ తరగతిలోనే విద్యార్థులు తమ భవిష్యత్తులకు బాటలు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే 10వ తరగతి విద్యార్థులు బాగా చదివి ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివితే తాము అనుకున్న లక్ష్యం చేరుకోవచ్చ న్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించి... పాఠశాల, తల్లిదండ్రు లకు మంచి పేరు తేవాలని యల్లంపాటి కోటేశ్వరబాబు కోరుకున్నారు. బాగా చదివే విద్యా ర్థులకు భవిష్యత్తులో తనవంతు సహకారం అందిస్తానని కోటేశ్వరబాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అక్కుర్తి, ముచ్చివోలు, వెలంపాడు పాఠశాలల ప్రధానోపాధ్యా యులు లక్ష్మయ్య, రమేష్ బాబు, రేణుక, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఆంగ్ల భాష పై పట్టు సాధించాలి

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : భాష ఉత్సవాల్లో భాగంగా ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని నెలవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం భాషా వారోత్సవాల్లో భాగంగా ఆంగ్ల వారోత్సవాల నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆంగ్ల ఉపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థులలో ఆంగ్ల భాష మరియు సాహిత్యం యొక్క ప్రాముఖ్యతను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమం. ఉపయోగపడుతుందన్నారు, ఇది అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రవేశపెట్టడాన్ని సూచి స్తుంది. నేటి ప్రపంచీకరణ ప్రపంచంలో ఆంగ్ల ప్రావీణ్యం యొక్క ప్రాముఖ్యతను గూర్చి వివరించారు, మానవ మనకొరకు ప్రతి భాషలో ప్రావీణ్యతను పొంది ఉండాలన్నారు, విద్యార్థుల చేత వ్యాసరచన పోటీలు స్కిట్ లు తదితరు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యుత్ వినియోగదారులు సోలార్ రూఫ్టాప్ను నిర్మించుకోండి

- సంఘమిత్రల సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్

విశాలాంధ్ర-సత్యవేడు: గృహ విద్యుత్ వినియోగదారులందరూ సోలార్ రూఫ్టాప్ను నిర్మించుకోవాలని సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. మంగళవారం స్థానిక శ్రీశక్తి భవన కార్యాలయంలో వెలుగు ఏపిఎం డాక్టర్ డాంగే యాదవ్ అధ్యక్షతన సంఘమిత్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో సోలార్ రూఫ్ టాప్ను నిర్మించుకోవచ్చును అన్నారు. వీటిని ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంద న్నారు. ఇందులో భాగంగానే ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్కు 30 వేలు, రెండు కిలోవాటుకు 60 వేల రూపాయలు, మూడు కిలోవాటుకు 78,000 వేల రూపాయలు ఈ పథకంలో సబ్సిడీ ఉంటుందని ఆయన వివరించారు. ఇంటి పైకప్పులో సోలార్ ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ బిల్లులు కూడా గణనీయంగా తగ్గించుకోవచ్చు అన్నారు. అందువల్ల గృహ విద్యుత్ వినియోగదారులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకో వాలని ఆయన కోరారు. ఎంఈఓ రవి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమంలో నిరక్షరాస్యు లకు అక్షరాలు నేర్పించాలన్నారు. మండలంలో ఉల్లాస్ దిగ్విజయంగా కొనసాగడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలలో పిల్లల హాజరు 70 శాతం ఉంటేనే తల్లికి వందనం పథకం వర్తిస్తుందన్నారు. ఉపాధి ఏపీవో కృష్ణయ్య మాట్లాడుతూ ఇంట్లోనే వ్యర్ధ జలాలను రోడ్లపైకి వదిలేయకుండా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని కోరారు. ప్రస్తుతం ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి 5500 రూపాయలు మంజూరు చేస్తామన్నారు. వ్యర్థ జలాలను ఇంకుడు గుంతలోకి మళ్లించడం వల్ల పరిసరాలు పరిశుభ్రతతో పాటు దోమలు వృద్ధి చెందే అవకాశాలు లేవన్నారు. ఈ సమావేశంలో వెలుగు కోఆర్డినేటర్లు పయని, శివకుమార్, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు కోటేశ్వరి ,అకౌంటెంట్ కాంచన పలువురు సంఘమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలి

- జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందస్వామి డిమాండ్

విశాలాంధ్ర - కార్వేటినగరం : జిల్లాలో ఉన్న గ్రామపంచాయతీలో పనిచేయు గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాలు ఇవ్వాలన్నారు. గతం నుంచి పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ కార్మికులను పంచాయతీలో నిలిపేసిన వారిని వెంటనే పనిలోపెట్టు కోవాలిగ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందస్వామి డిమాండ్చేశారు. పురం మండలంలో జరుగు గ్రీన్ అంబాసిడర్ జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చెయ్యాలని కోరుతూ ఈరోజు కార్వేటినగరం మండలం లో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రీన్ అంబాసిడర్ల వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోవిందస్వామి మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పనిచేసే గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్లో ఉన్న సుమారు 20 నుంచి 25 నెల జీతాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. గతంలో అన్ని పంచాయతీల్లో గ్రీన్ నంబర్ సర్ కార్మికుల పని చేశారని కానీ ఈరోజు నిధులు లేదని ఎక్కువ పంచాయతీల్లో తొలగించడం జరిగిందన్నారు. తొలగించిన కార్మికులందరినీ తిరిగి పనిలోకి తీసుకోవాలని అదేవిధంగా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 648 ప్రకారం 10000 జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్రీ నంబర్ సర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సంవత్సరం కాలంగా జిల్లా అధికార యంత్రాగాన్ని దృష్టికి తీసుకెళ్లిన ఇంతవరకు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. జీతాలు ఇవ్వమని అడిగితే పని నుంచి మీరే నిలిచిపోవాలని పంచాయతీ కార్యదర్శులు సర్పంచులతో చేతులు కలిపి పని నుంచి నిలిపివేసినారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ రెండవ జిల్లా మహాసభలను ఎస్ఆర్ పురములో నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ మహాసభ వేదికగా గతంలో జీతాలు లేకపోయినా పనులు చేస్తున్నటువంటి కార్మికులను నిలిపివేసిన ప్రతి పంచాయతీలోను కార్మికులను తిరిగి పనిలో తీసుకోవాలని కనీస వేతనాలు అమలుపరిచే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, రాజకీయ ఒత్తిళ్లు మానుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని అనేక సమస్యల పైన ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రాష్ట్ర జిల్లా ఏఐటీయుసీ నాయకులు హాజరు అవుతున్నారన్నారు. కావున జిల్లాలో ఉన్న గ్రీన్ అంబాసిడర్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ రెండవ సభను జయప్రదం చేయాలని కోరుతున్నాముఇప్పటికైనా వెంటనే అధికారులు స్పందించి జీతాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా తీసుకొచ్చిన 680 జీవో ప్రకారం 10000 జీతం ఇస్తామని చెప్పి రెండు సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ వేతనాలు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గోవిందస్వామి జీడీ నెల్లూరు ఆర్గనైజింగ్ సెక్రటరీ మోహన గ్రీన్ అంబాసిడర్ కార్మికులు నాయ కులు రాజేంద్రయ్య,ప్రమీల,నిర్మల మల్లీశ్వరి మునెమ్మ పుష్ప పాల్గొన్నారు.

రూ.2.26 కోట్ల సిమెంట్ రోడ్లు, భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

విశాలాంధ్ర - గుడిపాల : గుడిపాల మండలంలో మంగళవారం పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సందర్భంగా ప్రజల్లో ప్రభుత్వం పట్ల సంతృప్తికర భావన సంతోషాన్నిస్తుందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం గుడిపాల మండలంలో వరుసగా రెండవ రోజు మంగళవారం 2.26 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు చేశారు. సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి ఫలితంగా రాష్ట్రంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్న అన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పని జరగలేదని కూటమి ప్రభుత్వంలో 8 నెలలకే కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కరించడమే తన లక్ష్యమని చెప్పారు. గ్రామాల ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందిస్తే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను స్థానిక నాయకుల చేత రిబ్బన్ కట్ చేయించే ఎమ్మెల్యే తన ఉదారత చాటుకున్నారు. సి.బండపల్లి వద్ద ఆలయం నిర్మించాలని మహిళల కొరగా రూ.50 వేలు సొంత నిధులను విరాళంగా అందించారు. వసంతాపురంలో జరిగిన కార్యక్రమంలో రాయితీపై మంజూరు చేసిన 9 గ్రాస్ కట్టర్ యంత్రాలను రైతులకు పంపిణీ చేశారు. మంగళవారం నాటి కార్యక్రమాల్లో కిల్లారిపల్లి, గుడిపాల లేఅవుట్, గుడిపాల, అడవిచేను, పాప సముద్రం, వెప్పలమానుచేను, సి.బండపల్లి, చిత్తపార గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, గుడిపాలలో రైతు భరోసా కేంద్ర భవనం, చిత్తపారలో సచివాలయ భవనం, పిల్లారికుప్పంలో నీటి శుద్ధి ప్లాంటును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు మేయర్ ఎస్ అముద, మండలం స్థాయి అధికారులు, నాయకులు సుబ్బానాయుడు, బాలాజీ నాయుడు, చిట్టిబాబు, సాంబశివ నాయుడు, గోళ్ళ హరి, సుమతి, అనిల్,మాజీ సర్పంచ్ రవి నాయుడు , సర్పం చులు, ఎంపీటీసీలు, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం నెల్లూరు జిల్లా కోవూరు శాసనసభ్యురాలు, తిరుమల తిరుపతి పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి ఈమెకు దక్షిణ గోపురం వద్ద సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిది . లో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల అయమ్మల జిల్లా కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర -చిత్తూరు: పాఠశాలల ఆయమ్మలా రెండవ జిల్లా మహాసభ మంగళవారం చిత్తూరులో ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఆయమ్మల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. 23 మందితో జిల్లా సమితి ఏర్పాటు చేయడం జరిగింది.. అనంతరం జిల్లా గౌరవ అధ్యక్షులుగా కోదండయ్య,జిల్లా అధ్యక్షురాలుగా ఆశ, (గుడిపాల) జిల్లా ప్రధాన కార్యదర్శిగా జయ కుమారి (కార్వేటి నగరం) జిల్లా ఉపాధ్యక్షు లుగా లక్ష్మి (నగరి) తులసి (పాల సముద్ర0), వనిత (బంగారు పాలెం), భువన (వెదురుకుప్పం మండలం),జిల్లా సహాయ కార్యదర్శులుగా ఇందిరా (ఎస్ఆర్ పురం)మమతా (కార్వేటినగరం) కోకిల (జీడి నెల్లూరు), జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా మంజుల (ఎస్ఆర్ పురం)జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా సంధ్య,(చిత్తూరు), జిల్లా కోశాధికారిగా రాధా (పెనుమూరు), వీరితోపాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రోజా మమత దేశమ్మ,కాజముని, రమాదేవి ఎన్నుకోవ డం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షురాలు ఆషా, జిల్లా ప్రధాన కార్యదర్శి జయకుమారి , మాట్లాడుతూ ఈరోజు జిల్లాలో ఉన్న ఆయమ్మ సమస్యలపై వాళ్లు జీతాలు ఇప్పించడం కానీ గతంలో పెండింగ్లో ఉన్న 18 నెలలు జీతాలు కూడా ఇప్పించే విధంగా ఆయమ్మ లందరిని కలుపుకొని భవిష్యత్తు పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ చిత్తూరు పట్టణ కార్యదర్శి దాసరి చంద్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి ఆటో వర్కర్స్ యూనియన్జిల్లాకార్యదర్శి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

చిత్తూరు కమిషనర్‌కు ఏఐటియుసి వినతి

విశాలాంధ్ర -చిత్తూరు: చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏఐటీయుసి నేత నాగరాజు ఆధ్వర్యంలో నగర కమిషనర్ ర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాగరాజ్ మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు,పనుల అప్పగింత నిర్వహణ సాంఘిక భద్రత మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలన్నారు. ప్రైవేట్ కంపెనీ /ఏజన్సీలకు అప్పజెప్పొద్దని, అవుట్సోర్సింగ్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు.పర్మినెంట్ కార్మికులకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న సరెండర్ లీవ్‌లో ఎన్కామ్మెంట్ మూడు డీఏలు సత్వరం విడుదల చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల పెంపుకై గత సమ్మెలో నాటి ప్రభుత్వంతో అంగీకారమైన అగ్రిమెంట్ మేరకు వేతనాలు పెంచివ్వాలని, జనాభా ప్రాతిపదికన కార్మికులను పెంచాలన్నారు. ఇంజనీరింగ్ ఒప్పంద సిబ్బందికి సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని విన్నవించారు.ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

శ్రీ బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటినగరం గ్రామ దేవత అయిన శ్రీ బంగారమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. కొందరు భక్తులు అమ్మవారికి పొంగళ్ళు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కే ప్రసాద్, ఉపాధ్యక్షులు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని మాయాబజార్ సమీపంలో ఉన్న సిపిఎం కార్యాలయం నందు కసుకుర్తి కోటేశ్వరరావు,భారతి దంపతుల దాతృత్వంతో వారి కుమార్తె డాక్టర్ కసుకుర్తి భార్గవి జన్మదినం పునస్కరించుకొని కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు,వికలాంగులకు కూరగాయలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. డాక్టర్ భార్గవి జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులు కోటేశ్వర రావు , భారతి దంపతులు దాత లుగా వ్యవహరించారు.కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య ధాతగా వ్యవహరించిన కోటేశ్వరరావు,భారతి దంపతులకు మా ట్రస్ట్ తరఫున అభినందనలు తెలియ చేస్తున్నామని , పుట్టిన రోజు జరుపుకుంటున్న డాక్టర్ భార్గవి మా ట్రస్ట్ తరఫున జన్మదినం శుభాకాంక్షలు తెలియజేస్తూ జీవితాంతం సుఖ, సంతోషాలతో, నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అత్తి మంజరి గోపాల్,పర్వతాల రమేష్,పేయ్యల రమణయ్య, కసుకుర్తి కోటేశ్వరరావు,భారతి తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం

విశాలాంధ్ర - గూడూరు : తిరుపతి జిల్లా, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఫర్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సభ్యులు యేసుపాకు పెంచలయ్య ను గాంధీనగర్ యువత ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సిందే వెంకటేష్, దాసు, వెంకీ, వినోద్, మోసే, చిన్ని, తదితరులు పూలమాలలు, శాలువాలు తో సత్కరించి ,కేక్ కట్ చేయడం జరిగింది. జిల్లా అట్రాసిటీ కమిటీ లో సభ్యుని ఎంపికకు సిఫారసు చేసిన గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ కి కృతజ్ఞతలు తెలియ చేశారు.

ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం విడుదల

-టిడిపి రాష్ట్ర మైనారిటీ కార్య నిర్వహణ కార్యదర్శి షాకీరాలి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, మంత్రి నారా లోకేష్‌కి. మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కి. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కి రాష్ట్ర మైనారిటీ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీర్ అలీ ముస్లిం సోదరుల తరఫున కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇమామ్ మౌజన్ లకు ప్రతినెల గౌరవ వేతనం ఇస్తారని, ఇమామ్‌లకు నెలకు 10 వేలు. మౌజనులకు నెలకు 5 వేలు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం జరిగిందని చెప్పారు. 2024-25 ఏడాదికి గాను 45 కోట్లు మంజూరు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని, రంజాన్ నెల ప్రారంభమవుతున్న సందర్భంగా ముస్లిం సోదరులకు తీపి కబురు చెప్పారన్నారు. రాష్ట్రంలో ఇమామ్. మౌజన్ లు అప్లై చేసుకొని మసీదులు ఏమైనా ఉంటే వక్ఫ్ బోర్డు. ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు కూడా అవకాశం ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముస్లిం సోదరులు తరపున శ్రీకాళహస్తి ముస్లిం సోదరులు తరపున ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడుకి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కి కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.

సునీత హత్యకు కారణమైన నిందితులను అరెస్ట్ చేయాలి

ఐద్వా పట్టణ కార్యదర్శి జయంతి డిమాండ

విశాలాంధ్ర - పలమనేరు : పలమనేరు మండలం టీ వడ్డూరులో మైనర్ బాలికపై పలుమార్లు అత్యాచారం చేసి గర్భవతిని చేసి ప్రాణాలు తీసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించాలని ఐద్వా పట్టణ కార్యదర్శి జయంతి డిమాండ్ చేశారు. ఆమేరకు మంగళవారం తమ సంఘం నాయకులతో కలిసి సునీత భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిని పలుమార్లు లైంగికంగా వాడుకొని 9 నెలల గర్భవతిని చేసి రక్త హీనతతో డెలివరీ కావడం కష్టమై చనిపోవడం సభ్య సమాజం సిగ్గుపడేలా వుంది. దీనికి కారుకులైన మంజు, నవీన్, హరిత, రోజాలను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఇలాంటి ఘటన జరగకుండా ఉండాలని కోరారు. ఈ గ్రామంలో ఇది కొత్త కాదని గ్రామస్తులు వాపోతున్నారు. రెండుసార్లు గతంలో కూడా ఇలాంటి చోటు చేసుకున్నా ఎవరికి చెప్పుకున్నా న్యాయం జరగలేదని ప్రజలు వాపోతున్నారు. ఇది మూడోసారి ఘటన జరుగుతున్నది ఇకనైనా మహిళలకు రక్షణ కల్పించాలని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకు తున్నామని ఆడ పిల్లలు వున్న తల్లి దండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు,ప్రభుత్వం స్పందించి సునీత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ధనమ్మ, అమరమ్మ, సిఐటియు నాయకులు గిరిధర్ గుప్తా, రాజా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మునిసిపల్ శాఖ వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - పుత్తూరు : సమ్మె సందర్భంగా ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని నెరవేర్చా లని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షు లు ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ య్య నగరి కమిషనర్ కు వినతిపత్రం అందించారు. మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు,వసుల అప్పగింత నిర్వహణ సాంఘిక భద్రత మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలని ప్రైవేట్ కంపెనీ/ఏజన్సీలకు అప్పజెప్పొద్దుని నగరి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కోదండయ్య డిమాండ్ చేశారు. నగరి మున్సిపల్ కమిషనర్ సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ అవుట్సోర్సింగ్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు పర్మినెంట్ కార్మికులకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్‌లో ఎన్కాష్మెంట్ మరియు మూడు డీఏలు సత్వరం విడుదల చేయాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల పెంపుకై గత సమ్మెలో నాటి ప్రభుత్వంతో అగ్రిమెంట్ మేరకు వేతనాలు పెంచివ్వాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన శానిటేషన్ కార్మికులను పెంచాలని మున్సిపల్ కార్మికుల్లో సుమారు పదిమంది మరణించడం జరిగింది. వారి కుటుంబ సభ్యులకు పిల్లలకు పిఎఫ్. క్లైములు ఇంతవరకు జరగలేదు. దీనివల్ల నా కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయి. వెంటనే పెండింగ్లో ఉన్న పీఎఫ్ డబ్బులు చెల్లించి చనిపోయిన కుటుంబాలకు పిఎఫ్ తీసుకున్న విధంగా చేయాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్ గారు పైన ఉన్నది. అలాగే ప్రతి నెల కార్మికుల వేతనాలు నుంచి ఈఎస్ఐ డబ్బులు రికవరీ చేసినప్పటికీ ఇంతవరకు కనీసం ఈఎస్ఐ కార్డులు చెల్లించలేదు. కార్మికులకు ఉచిత వైద్య సదుపాయం పొందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగ, కార్మికుల వలె ఔట్ సోర్సింగ్ ఉద్యోగ,కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్యా సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మురళి ఏ ఐ టి యు సి పట్టణ నాయకులు భాషా శేఖర్ ఏసు మున్సిపల్ యూనియన్ నాయకులు నాగరాజు సతీష్ చిన్న రాసు సుబ్రహ్మణ్యం రవి హనుమంతు కుమార్ రాజేష్ ఎల్లమ్మ వెంకటమ్మ శారద పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్...కార్పొరేట్ల కోసమే బడ్జెట్

బడ్జెట్ పై కరపత్రాలు ఆవిష్కరించిన వామపక్ష నాయకులు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణం లోని టవర్ క్లాక్ సెంటర్ లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం సిపిఐ సిపిఎం వామపక్ష నాయకులు ఆధ్వర్యంలో దేశాన్ని ప్రజలను కొల్లగొట్టే కేంద్ర బడ్జెట్" సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్ , సీపీఎం ప్రాంతీయ ఆర్గనైజర్ జోగి శివ కుమార్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 'కాకులను కొట్టి గద్దలకు పెట్టడం' అనేది ప్రజలు వింటున్నారని, ఇప్పుడు ప్రత్యక్షంగా అర్థం కావాలంటే 2025-2026 ఆర్థిక సంవత్సరానికి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ తాజా ఉదాహరణ అని పేర్కొన్నారు.సామాన్యులను కొల్లగొట్టి కార్పొరేట్ శక్తులకు సంపదను సమర్పించుకునే బడ్జెట్ అని తెలిపారు.. గత నాలుగేళ్లుగా విశాఖ ఉక్కు పై పోరాడుతున్నా ఆ ఊసే ఈ బడ్జెట్ లో లేదని, పోలవరం, రాజధాని, మెట్రో రైలు, రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ఏ హామీకి పూర్తిస్థాయిలో కేటాయింపులు లేకపోవడం దురదృష్టకరమన్నారు.ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచారని, మూడేళ్ల కాలంలో పెద్ద కార్పొరేట్ కంపెనీలు 12 లక్షల కోట్లు రూపాయలు ఎగనామం పెట్టడం జరిగిందని తెలిపారు. "పేదల బడ్జెట్ కాదని - ఇది కార్పొరేట్ల బడ్జెట్ అని", మధ్యతరగతి ప్రజలకు ఏవిధంగా ఉపయోగపడే విధంగా లేదని, ఈ బడ్జెట్ ను వెంటనే మార్పు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు, రాష్ట్రవ్యాప్తంగా మొదలైన నిరసన కార్యక్రమాలు 18,19 తేదీలలో వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో గూడూరు పట్టణ, ప్రధాన కూడళ్ళ లోని, బస్టాండ్ లోని గ్రామీణ ప్రాంత రైతులకు, గ్రామీణ వాసులకు, ప్రయాణికులకు, వ్యాపారస్తులకు, పట్టణ ప్రజలకు తెలియజేసేందుకు ముమ్మరంగా ఈ కరపత్రాలను చేరవేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20వ తేదీన పాత బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామ పక్షాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం జరుగుతుందని, ప్రజాసంఘాలు, సానుభూతిపరులు, అభిమానులు, రైతులు కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా, ఏ. ఐ.టి.యు.సి నియోజక వర్గ అధ్యక్షులు ఎంబేటి చంద్రయ్య , వెంకటయ్య , సీపీఎం నాయకులు టి.వెంకట రామిరెడ్డి, బి.వి.రమణయ్య, యస్.సురేష్, అడపాలప్రసాద్,కె.డేవిడ్,బి.మోసే,డి.ప్రసన్న,బి.మహేంద్ర,ముత్యాలయ్య,ఏలీయా,సురేష్, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

విశాలాంధ్ర-పుత్తూరు: పట్టణంలోని షాపువీధిలో మంగళవారం రాత్రి భారతమ్మ అనే వృద్ధురాలి మెడలోని 3 సవర్ల బంగారు గొలుసును ఓ దుండగుడు లాకెళ్లినట్లు ఎస్ఐ ఓబయ్య తెలిపారు. అద్దెకు ఇల్లు కావాలంటూ ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు భారతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర- పాకాల : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించండి- పెండింగ్ క్లైయిమ్ లు పరిష్కరించండిఏఐటియూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలు ఈనెల 23. 24 తేదీల్లో రెండు రోజుల పాటు తిరుపతిలో జరగనున్నాయి ఈ మహాసభల బైరాగి పట్టెడలో గల గంధమనేని శివయ్య భవన్‌లో జరుగుతాయి. ఈ సందర్భంగ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు .మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలు రెండు రోజులపాటు తిరుపతిలో ఈనెల 23.24 తేదీల్లో జరుగుతున్నాయని ఈ మహాసభలలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారాలు రాబోయే కాలంలో చేపట్టవలసిన ఆందోళన కార్యక్రమాలు రూపకల్పన జరుగుతుందని అలాగే నూతన సమితి ఏర్పాటు కూడా జరుగుతుంది అని వారు అన్నారు జిల్లాలోని భవన నిర్మాణ కార్మికుల పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మిక సంఘంజిల్లా మహాసభలకు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి భవన నిర్మాణ కార్మికు లు లోక్ సింగ్ మునీల్ ముబారక్ చంద్ర శ్రీనివాసులు నవీన్ తదితరులు పాల్గొన్నారు

కార్యకర్తలు సైనికుల వలె పనిచేసి

పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శతలపా దామోదరం రెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : కాంగ్రెస్ పార్టీ పూర్వం కన్నా నేడు రాష్ట్రంలో ముందంజలో పయనిస్తుందని, ఇది శుభ సూచికమని ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సైనికుల వలె కష్టపడి కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ తలపా దామోదరం రెడ్డి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. గురువారం నాడు తిరుపతి జిల్లా డీసీసీ మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులచే జరగబోయే నియోజకవర్గ సమావేశ ఏర్పాట్లకు సంబంధించి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసుకొని కార్యక్రమం విజయవంతం చేయుట కొరకు, కాంగ్రెస్ పార్టీ ని ప్రజల్లోకి ఏ విధంగా తీసుకుని వెళ్లాలి భవిష్యత్తు కార్యక్రమాల్ని ఏ విధంగా రూపకల్పన చేసుకోవాలి అనే దిశగా సమాలోచనలు చేశారు. అనంతరం నియోజకవర్గ సమన్వయకర్త మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పూర్వం కన్నా నేడు రాష్ట్రంలో ముందంజలో పయనిస్తుందని, ఇది శు భ సూచికమన్నారు. ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సైనికుల వలె కష్టపడి కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి తీసుకొని వెళ్లవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కలిందర్, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేందర్ రెడ్డి రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్ బోస్ రాయల్, ఆంటోని, నవీన్, సమీర్, వెంకటేష్, మునిరాజా, శ్రీకాళహస్తి, రేణిగుంట మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఆయాల జిల్లా నూతన కమిటీని ఎన్నిక





విశాలాంధ్ర - పుత్తూరు: జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్యా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు పర్యవేక్షణలో 23 మందితో జిల్లా సమితి ఏర్పాటు చేయడం జరిగింది అనంతరం జిల్లా గౌరవ అధ్యక్షులుగా కోదండయ్య,జిల్లా అధ్యక్షురాలుగా ఆశ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్ జయ కుమారి, జిల్లా ఉపాధ్యక్షులుగా లక్ష్మి తులసి, వనిత భువన, జిల్లా సహాయ కార్యదర్శులుగా ఇందిరా, మమత, కోకిల, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా మంజులజిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా సంధ్య,, జిల్లా కోశాధికారిగా రాధా , వీరితోపాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా రోజా మమత దేశమ్మ, కాజమున్ని, రమాదేవి ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షురాలు ఆషా, జిల్లా ప్రధాన కార్యదర్శి జయ కుమారి , మాట్లా డుతూ జిల్లాలో ఉన్న ఆయమ్మ సమస్యలపై పోరాటాలకు శ్రీకారం చుడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్యా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు చిత్తూరు పట్టణ కార్యదర్శి దాసరి చంద్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి

- మార్చి 17 నుండి 31 వరకు జరగనున్న పదవ తరగతి పరీక్షలు
- జిల్లాలో 164 కేంద్రాల్లో హాజరు కానున్న 28656 మంది విద్యార్థులు
- ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు చేపట్టాలి
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలి :కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని, ఎక్కడ కూడా మాస్ కాపింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పదవ తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, డి ఆర్ ఓ నరసింహులు, డి ఈ ఓ కె వి ఎన్ కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ప్రభాకర్ రెడ్డి, సంబంధిత జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మార్చి 17 నుండి 31 వరకు జరగనున్న పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షా పత్రాలు భద్రపర్చే కేంద్రంలో సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. మార్చి 17 నుండి 31 వరకు 10 వ తరగతి రెగ్యులర్ వారికీ , 17 నుండి మార్చ్ 28 వరకు ఓపెన్ స్కూల్స్ విద్యార్థులకు 10 వ తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. రెగ్యులర్, ప్రైవేటు కలిపి జిల్లాలో 164 కేంద్రాల్లో 28656 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఓపెన్ స్కూల్స్ పదవ తరగతి చదువుతున్న 1019 మంది విద్యార్థులకు గానూ 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయమని తెలిపారు.ఓపెన్ స్కూల్స్ పదవ తరగతి పరీక్షలు మార్చి 17 వ తేది నుండి 28 వ తేది వరకు, ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి అని అన్నారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు.ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ మార్చ్ 3 వ తేది నుండి 15 వ తేది వరకు ఉదయం 9 గంటల నుండిమధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి.ఇంటర్మీడియట్ చదువుతున్న 2838 విద్యార్థులకు గాను14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరీక్షల సమయంలో అవసరమగు బస్సులను నడపాలని, సంబంధిత సమయాలను ముందుగా పత్రికా ముఖంగా తెలియజేయాలని ఆర్.టి.సి అధికారులను ఆదేశించారు. ఈ పరీక్షలు కట్టుదిట్టంగా, ఎక్కడా కాపీ జరగకుండా నిర్వహించాలని తెలిపారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్ ను, డిపార్ట్మెంటల్ అధికారిని నియమించాలని, 6 ఫ్లయింగ్ స్కాడ్ లను ఏర్పాటు చేయాలనీ సూచించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జెరాక్స్ కేంద్రాలను, నెట్ సెంటర్లను మూసి వేయాలని తెలిపారు. 10 రూట్ లను ఏర్పాటు చేసి రూట్ ఆఫీసర్లను నియమించాలన్నారు. పరీక్షా కేంద్రాలతోపాటు స్పాట్ వాల్యూయేషన్ కేంద్రం వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులకు, తాగు నీరు, పారిశుద్యం ఏర్పాటు చేయాలనీ మున్సిపల్ కమీషనర్లకు, డి.పి.ఓకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద, స్పాట్ వాల్యూయేషన్ కేంద్రం వద్ద మెడికల్ క్యాంపు లను నిర్వహించి అత్యవసర మందులను సిద్ధంగా ఉంచాలని డి.ఎం.హెచ్.ఓ కు సూచించారు. ఈ సమావేశం లో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ గురుస్వామి రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బాలకృష్ణ నాయక్, డిప్యూటీ ఈవో బాలాజీ, జిల్లా రవాణా శాఖ అధికారి మురళీ మోహన్, డి పి ఓ సుశీలాదేవి, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు ఘన స్వాగతం

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు రేణిగుంట రైల్వే స్టేషన్ నందు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, రేణిగుంట మండల పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి ఘనంగా స్వాగతం తెలిపారు . కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు వ్యతిరేకంగా బుధవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో తిరుపతి అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే నిరసన ధర్నాకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొనడానికి తిరుపతికి వస్తున్న సందర్భంగా రేణిగుంట రైల్వే స్టేషన్లో ఆయనకు ఆ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికినట్టు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మం డల కార్యదర్శి మోహన్‌రెడ్డి, వైఎస్ మణి , తులసి రాజన్, కార్తిక్ , వివిధ ప్రజాసంఘాలనాయకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ఆధార్ నమోదుపై జిల్లా కమిటీ

- ఆధార్ నమోదులో తప్పులు లేకుండా జిల్లా కమిటీ అధికారులు చూడాలి
- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : ఆధార్ నమోదులోను, అప్డేట్ లోను ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. తప్పుడు సమాచారాన్ని అప్లోడ్ చేసే ఆపరేటర్ల పై పెనాలిటి వేయడం జరుగుతుందని స్పష్టం చేసారు. మంగళవారం తిరుపతి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆధార్ నమోదు పై జిల్లా కమిటీతో సమావేశం నిర్వహించారు. 5 సంవత్సరాల లోపు పిల్లలకు, వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్. జివిస్డబ్ల్యు, పోస్టల్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలన్నీ పని చేయాలన్నారు. జిల్లాలో కొత్తగా జన్మించిన శిశువుల ఆధార్ ఎన్రోల్మెంట్, దీనికి సంబంధించి బర్త్ రిజిస్ట్రేషన్ బేస్డ్ ఆధార్ ఎన్రోల్మెంట్ అనే విధానాన్ని అవలంబించి మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్, ఆధార్ ఎన్రోల్మెంట్, జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఇంకా 61998 మంది 5 సంవత్సరాల లోపు పిల్లలు ఆధార్ ఎన్రోల్మెంట్ చేసుకోవాల్సి ఉందని అన్నారు. ఐదు సంవత్సరాల నుండి 15 సంవత్సరాల మధ్యలో 77358, జరగాల్సిన మొదటిసారి మానడేటరీ బయో మెట్రిక్ అప్డేట్, 16 నుండి 18 సంవత్సరాల మధ్యలో 103622 జరగాల్సిన రెండవసారి మాండేటరీ బయోమెట్రిక్ అప్డేట్ వంటివి పూర్తిచేసి విద్యార్థులకు నీట్, జేఈఈ ఇతర ఇతర పరీక్షలకు అడ్డంకులు లేకుండా చేయాలన్నారు. 17 సంవత్సరాలకు పైబడి మాండేటరీ బయోమెట్రిక్ పెండింగ్ 180980 ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు వారిచే నిర్వహించబడుతున్న 9 రకాల స్టేట్ హెూల్డర్స్ ఆధార్ సెంటర్లలో ఉన్న ఆపరేటర్లను ప్రతినెల అవగాహన సదస్సులు నిర్వహించడం, తప్పుడు డాక్యుమెంట్లను అప్లోడ్ చేసి ఆధార్ సర్వీసులు అందించిన వారిపై అపరాధ రుసుమును విధించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న వివిధ రకాల ఆధార కిట్లు అన్ని వర్కింగ్ కండిషన్ లో ఉండేటట్లు చూడాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆధార్ సెంటర్ లను జిల్లా యంత్రాంగం తనిఖీ చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించి ఉన్న వాటిపై తగు చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. స్కూల్స్, కాలేజీల్లో, ఆదర్శ స్పెషల్ క్యాంపులు నిర్వహించి మాండేటరీ బయోమెట్రిక్ లో ఉన్న పెండింగ్ పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశ లో డిఆర్ఓ నరసింహులు, డిపిఓ సుశీల దేవి, తిరుపతి డిఎల్డిఓ జీ.వి నారాయణరెడ్డి, (యువైడిఐ హైదరాబాద్ రీజినల్ ఆఫీస్) అసిస్టెంట్ మేనేజర్ దామోదర్, డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, ద్వామా పిడి శ్రీనివాసరావు, ఎల్డిఎం విశ్వనాథ రెడ్డి, సూళ్లూరుపేట డిఎల్డిఓ జాల్ రెడ్డి, కాళహస్తి డిఎల్డిఓ సుస్మిత, గూడూరు డిఎల్డివో వాణి, మహిళ పోలీస్ డిఎస్పి శ్రీలత, పోస్టల్‌శాఖనాగరాజు,డిస్టిక్‌కోఆర్డినేటర్‌వెంకటేశ్ పాల్గొన్నారు.

కామన్ పీజీ సెట్‌ను రద్దుచేయాలి

- ఎన్నికలకు ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీని నారా లోకేష్ నిలబెట్టుకోవాలి
- రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి నిర్వహిస్తున్న ఉమ్మడి పీజీ సెట్ రద్దు చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌కి వినతి

విశాలాంధ్ర- తిరుపతి : రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి నిర్వహిస్తున్న ఉమ్మడి ఏపీ పీజీ సెట్‌ను రద్దు చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌కి విద్యార్థి సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు పిజిసెట్ల నిర్వహణ గురించి ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడం విద్యార్థులను మోసం చేయడమేనన్నారు. 2021 సంవత్సరం ముందు పిజి సెట్‌లో నిర్వహణ ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ పీజీ ప్రవేశాలు నిర్వహించే వారిని 2021 సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా కామన్ పీజీ ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించడం ప్రారంభించారు. ఇలా ఉమ్మడి పీజీ ప్రవేశాలు నిర్వహించడం వలన 2021 నుండి 2024 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి విశ్వ విద్యాలయాలలో 30% నుండి 40% అడ్మిషన్స్ లేక యూనివర్సి టీలన్నీ విద్యార్థులు లేక ఖాళీ ప్రదేశాలుగా మారుతున్నాయన్నారు. 2024 ఎన్నికల హామీలలో భాగంగా నారా లోకేష్ ఉమ్మడి పీజీ అడ్మిషన్ల రద్దుచేసి ఏ యూనివర్సిటీకి యూనివర్సిటీ ప్రవేశాలు పెట్టే విధంగా చర్యలు తీసుకుంటామని ఆనాడు విద్యార్థులకు హామీ ఇచ్చారని తెలిపారు. ఇటీవల ఉన్నత విద్యా మండలి విడుదల చేసిన వివిధ కోర్సులకు సంబంధించిన ప్రదేశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌లో పీజీ సెట్ పాత పద్ధతిలో ఉమ్మడిగానే ఉందని ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ పీజీ సెట్ నిర్వహించుకోవడానికి అవకాశం లేదని తెలిపారు.గత ప్రభుత్వ విధానాల్ని ఈ ప్రభుత్వం కూడా కొనసాగిస్తూ ఉన్నత విద్యను ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ కూడిన నూతన జాతీయ విద్యా విధానాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే విశ్వవిద్యాలయాల్లో ఉమ్మడి పీజీ ప్రవేశం నిర్వహించడం ద్వారా 50% పైగా డిపార్ట్మెంట్లలో అడ్మిషన్స్ లేక ఉన్న సందర్భంలో మళ్లీ కామన్ పీజీ ప్రవేశం నిర్వహించడం అనేది యూనివర్సిటీలకు ప్రైవేటుపరం చేసే దిశగా అడుగులు వేస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడే విధంగా ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ ప్రవేశాలను నిర్వహించే విధంగా చర్యలు తీసుకొని కామన్ పీజీ సెట్ ను రద్దు చేయాలని తెలిపారు విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విద్యార్థి సంఘ నాయకుల డిమాండ్ చేశారు. ఈ ఏపీ పీజీసెట్ గురించి విద్యార్థులకు ఎవరికీ ఎటువంటి అవగాహన లేక విశ్వవిద్యాల యాల్లో విద్యార్థుల సంఖ్య పడిపోవడం జరిగింది .రానున్న రోజుల్లో వర్సిటీలో దశల వారి ఉద్యమాలు ప్రారంభిస్తామని అవసరమైతే రాష్ట్రవ్యాప్త బందు కూడా పిలుపునిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు అక్బర్ రవి,ఏఐఎస్ఎఫ్ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, బీసీ విద్యార్థి సంఘ నాయకులు తిరుమలేష్, నాల్స వ్యవస్థాపకులు సుందర్ రాజ్,ఐశ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు రంజిత్ , చిన్న ,ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్, శ్రీధర్, ఓ బి సి నాయకులు ఉత్తరాది విజయ్, జై భారత్ విద్యార్థి సంఘం వ్యవస్థాపకులు భార్గవ్, ఏఐఎస్ఎఫ్ ఎస్వీ యూనివర్సిటీ కార్యదర్శి చంద్రనాయక్, ఎస్ఎఫ్ఐనగరఅధ్యక్షకార్యదర్శులు బాల ,తేజ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శునకానికి ఘనంగా పదవీ విరమణ

విశాలాంధ్ర -చిత్తూరు: చిత్తూరు పోలీసు శునకం పదవీ విరమణ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు చిత్తూరు లోని సాయుధ దళం కార్యాలయంలో జెన్నీ అనే పోలీస్ శునకం పదవీ విరమణ జరిగింది. దాదాపు పదకొండు ఏళ్ళ పాటు పోలీసు డిపార్టుమెంటుకు సేవలంది ంచిన జెన్నీ అనే పోలీసు శునకం పదవీ విరమణ కార్యక్రమాన్ని మణి కంఠ చందోల్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందుతున్న జెన్నీ, పోలీసు శునకం కు శాలు వా కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధుల్లో జెన్నీ చేసిన సేవలను కొనియాడారు. పలు కేసుల దర్యాప్తుల్లో జెన్నీ సహకారం మరువలేమని ప్రశంసించారు. ఈ శునకం హ్యాండ్లర్ .శ్రీనివాసులను కూడా ఎస్పీ అభినందించారు.జెన్నీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో హైదరాబాద్ లోని మొయినాబాద్ నందు ఎక్సప్లోజివ్ విభాగము నందు 8 నెలల కఠిన శిక్షణ పొందింది. జెన్నీ విఐపి , వివిఐపి కార్యక్రమాల యందు మెరుగ్గా సేవలు అందిం చింది. ముఖ్యమైన దేవాలయాలు అయిన కాణిపాకం, తిరుమల యందు బ్రహ్మోత్సవాలు, గోదావరి పుష్కరాల సమయాలలో సంఘ విద్రోహ చర్యల నివారణ కొరకు దీని సేవలు ఉపయోగించేవారు. పలు కీలకమైన కేసుల యందు దీని సహకారం ఉపయోగకరమైనది. అలానే పోలీసు విధులలో భాగమైన ఎన్నికలలో చురుగ్గా పాల్గొనింది. తన అనుగుణమైన శైలితో ఉన్నతమైన సేవలు పోలీసు డిపార్టుమెంటుకు అందించింది. ప్రపంచ నౌకాదళ రోజు సందర్భముగా వైజాగ్ లో నిర్వహించిన ఏ ఎస్ సి విధులు నందు జెన్నీ తన ప్రతిభను కనబరిచింది. ఈ పదవీ విరమణ కార్యక్రమంలో చిత్తూరు సబ్-డివిజన్ డి.ఎస్పీ టి.సాయినాథ్, ఏఆర్ డిఎస్పి మహబూబ్ బాషా, ఎస్.బి. ఇన్స్పెక్టర్ భాస్కర్, సుధాకర్ తదితరులు హాజరయ్యారు.